నవోదయ ప్రవేశ పరీక్షకు 6,362 మంది హాజరు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 6 వ తరగతి ప్రవేశానికి సంబంధించి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగిందని నవోదయ ప్రిన్సిపల్ ఆర్.కమలం తెలిపారు. 2024-25 విద్యా సంవత్స రంలో 6 వ తరగతి ప్రవేశానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 37 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించబడిందన్నారు. ఈ పరీక్షకు 8506 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6362 మంది 75 శాతం పరీక్షకు హాజరయ్యారన్నారు.

పరీక్షా కేంద్రంలో పర్యవేక్షిస్తున్న అధికారులు

ప్రశాంత కోనసీమలో హింస రాజేశారు

మండపేట సభలో టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి, మండపేట

ప్రశాంతతకు నిలయమైన కోనసీమను వైసిపి నేతలు దాడులు, దౌర్జన్యాలు, అల్లర్లతో హింసకు కేంద్రంగా మార్చారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండపేటలో శనివారం నిర్వహించిన రా.. కదలిరా బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. అల్లర్లు జరిగి ఇక్కడ వారం రోజులు ఇంటర్నెట్ కట్ చేశారంటే పరిస్థితి ఎలా ఉందో చూడాలని, రౌడీయిజంతో కోనసీమను మరో పులివెందులగా మారుద్దామనుకుంటున్నారా అని ప్రశ్నించారు. 'వైసిపి ఐదేళ్ల పాలనలో మహిళలు, రైతులు, రైతు కూలీలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు ఎవరైనా ఆనందంగా ఉన్నారా? ఏ కులం, మతం, ప్రాంతం వారు ఆనందంగా లేరు. దీనికి కారణం వైసిపి విధ్వంస పాలన. రా..కదలిరా అనేది నాకోసం కాదు. దగా పడ్డ ఆంధ్రప్రదేశ్ కోసం. ఈ పాలనలో ఆక్వా రైతు కుదేలయ్యాడు. ధాన్యం రైతు దగా పడ్డాడు. కానీ గంజాయి పండించిన రైతులు బాగున్నారు. మండపేటలో సైతం గంజాయి అమ్ముతున్నారు.

బాధ్యత లేని ముఖ్యమంత్రి పాలనలో ప్రతిరోజు ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. ధాన్యం కొనే నాథుడు లేదన్నారు. సాగునీరు రాక వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందన్నారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలో మూడు పంటలకు నీరు వచ్చేదన్నారు. నష్టాల్లోఉన్న ఆక్వా రంగాన్ని ఆదుకుని వారికి యూనిట్ రూ.1.50కే అందిస్తామన్నారు. అన్న క్యాంటీన్ మూసివేసి ఫీజు రీయింబర్స్‌మెంట్, సబ్ ప్లాన్, సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు రంజాన్ తోఫా తదితర 100 సంక్షేమ పథకాలకు కోత పెట్టారన్నారు. విద్యుత్, బస్ ఛార్జీలు, అన్నిరకాల పన్నులు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. నాసిరకం మద్యం అమ్మకాలు పెంచి రాష్ట్రంలో 35 లక్షల మంది అనారోగ్యం పాలు కావడమే కాకుండా 35 వేలమంది మృత్యువాత పడ్డారన్నారు.

ఆర్థికంగా సామాజికంగా బిసిలను అభివృద్ధిలోకి తీసుకు వచ్చి వారి రుణం తీర్చుకుంటామన్నారు. టిడిపి హయాంలో ఇసుక ఉచితంగా అందిస్తే ఇసుక ధరలు విపరీతంగా పెంచేసి సామాన్యులకు అందకుండా చేశారన్నారు బాట ఛార్జీంటూ పేదవారిని దోచుకుంటున్నారన్నారు. ఇసుక దొంగలను వదిలేది లేదని, వారు దోచుకున్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు. ఇసుక అందుబాటులో లేక 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక వలసలు పోతున్నారన్నారు. అన్ని కులాలకు కార్పొరేషన్లు పెట్టి రూపాయి కూడా ఖర్చు పెట్టలేదన్నారు. ముఖ్యమంత్రి చేసిన నేరాలకు ఎంఎల్ఎలు, మంత్రులను బలిపశువులను చేసి బదిలీ చేస్తున్నారన్నారు.

అంటరానితనం నిర్మూలనకు జస్టిస్ పున్నయ్య కమిటీ వేసి 12 జిఒలతో దళితులకు న్యాయం చేసిన పార్టీ తెలుగు దేశం అన్నారు. దళితుల 27 సంక్షేమ పథకాలు రద్దు చేసి రూ.27 వేల కోట్లు ఖర్చు చేయలేదన్నారు. వైసిపి పాలనలో 187 మంది దళితులు హత్యకు గురయ్యారన్నారు. దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎంఎల్‌సిని ఊరేగిస్తున్నారన్నారు. ఇన్ని చేస్తూ మరోపక్క అంబేద్కర్ విగ్రహం పెట్టి ఇదే సామాజిక న్యాయం అంటూ గొప్పలు చెబుతున్నారన్నారు. అంబేద్కర్ చెప్పినట్లు రాజ్యాంగం గొప్పదైనా అమలు చేసే పాలకులు అసమర్థులైతే అరాచకం రాజ్యమేలుతుందన్నారు. యథా రాజా తథా ప్రజ అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆయన ఎంఎల్ఎలు, నాయకులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని చంద్రబాబు విమర్శించారు. మండపేట వైసిపి ఇన్‌ఛార్జి చాలా తెలివైనవాడని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ఇసుకలో రూ.500 కోట్లు కొట్టేశారు. తాతపూడి ర్యాంపులో మండపేట మున్సిపాలిటీలో ఇళ్ల పట్టాల పేరుతో రూ.20 లక్షలు కూడా విలువ చేయని భూముల్ని రూ.50 లక్షలకు కొట్టేశారు. రౌడీయిజం చేస్తున్నారు. కాలేరు గ్రామంలో ఐదుగురు దళిత యువకులపై రౌడీ షీట్ ఓపెన్ చేయించారు. ఇద్దరు సర్పంచ్‌లపై కేసులు పెట్టారు. రేపు మీ గతి ఇదే. రామచంద్రాపురంలో చెల్లని కాసు చెల్లుబోయిన.. వేణు. విజయసాయిరెడ్డి కాళ్ల మీద పడి బిసిల ఆత్మగౌరవం తాకట్టు పెట్టారు. ముమ్మిడివరంలో పొన్నాడ సతీష్ రూ.15 లక్షల విలువైన భూమి రూ.30 లక్షలకు అమ్ముకున్నారు. లేఅవుట్ వేయాలంటే ఆయనకు కమీషన్లు ఇవ్వాలి. యానాం నుంచి అక్రమ మద్యం తెచ్చి అమ్ముతున్నారు. అమలాపురంలో పినిపే విశ్వరూప్ అవినీతికి అడ్డూ అదుపూ లేదు.' అని చెప్పారు.

టిడిపి అధికారంలోకి రాగానే ముమ్మిడివరంలో గోదావరి నదిపై వంతెన నిర్మిస్తామని, బాలయోగి చిరకాల వాంఛ కోనసీమ రైల్వే లైన్‌ను పూర్తి చేస్తామని, ముక్తేశ్వరం-కోటిపల్లి మధ్య, సఖినేటిపల్లి-నర్సాపురం మధ్య వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులకు బీమా పథకాన్ని ఏర్పాటు చేస్తామని, నష్టపోయిన కల్లు గీత, మత్స్యకారులు, చేనేత కార్మికులకు ఏ విధంగా న్యాయం చేయాలో చేసి చూపిస్తామని చెప్పారు. వైసిపి ఎంఎల్ఎ జగ్గిరెడ్డికి ప్రతి పనికీ కప్పం కట్టాలంట..కానీ ఆయన్ని మాత్రం జగన్ మార్చలేదు. అనపర్తి ఎంఎల్ఎను మార్చలేదు. హోల్‌సేల్ కరప్షన్ కింగ్ ద్వారంపూడిని మార్చలేదు. వైసిపి ఎంఎల్ఎల అవినీతిపై ఆధారాలు ఇస్తాం.. కేసులు పెట్టే ధైర్యం ముఖ్యమంత్రికి ఉందా అని ప్రశ్నించారు. జగన్ సహా వైసిపి ఎంఎల్ఎల అవినీతిపై ఛార్జిషీట్లు వేస్తాం. దళిత మంత్రుల్ని మార్చారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను నాయకులుగా ఎదగకుండా జగన్ రెడ్డి అడ్డుకుంటున్నాడని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి స్వర్ణ యుగం రావాలంటే ప్రజలంతా టిడిపి, జనసేన పార్టీలను గెలిపించాలని పిలుపు ఇచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అందరి రుణం తీర్చుకుంటానని చంద్రబాబు నాయుడు అన్నారు.

సభలో మాట్లాడుతున చంద్రబాబు

సభకు హాజరైన జనసందోహం

ఇవిఎం, వివి ప్యాట్ గొడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం, వివి ప్యాట్ గోదాముకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలి పారు. శనివారం రెవెన్యూ, ఎన్నికలు, అగ్ని మాపక శాఖల అధికారులతో కలిసి ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పా ట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఇవిఎంల భద్రతకు చర్యలు తీసుకోవాలని ఎన్నికలు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల మేరకు ప్రతి నెల ఇవిఎం, వివి ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదిక కను పంపిస్తున్నట్లు వెల్లడించారు. అనం తరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాకు చెందిన ఎపిక్ కార్డులు పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నిక అధికారులు ఎపిక్ కార్డులు పంపిణీ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో నూరుశాతం కార్డుల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

కెవిపిఎస్ 2024 డైరీ ఆవిష్కరణ

డైరీని ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన 2024 డైరీను శనివారం మధ్యాహ్నం కాకినాడ సుందరయ్య భవన్ వద్ద దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు మోర్త రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, దళిత సత్తా నాయకులు బచ్చలి కామేశ్వరరావు, సిఐటియు నాయకులు పి. వీరబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుడితి సురేష్ కుమార్, కూరాకుల సింహాచలం, నాయకులు నేరేడుమిల్లి రాజు, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

వల్లభ స్వామికి రూ.3.06 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2,20,440, అన్నదాన విరాళాల ద్వారా రూ.79,294, కేశఖండన ద్వారా రూ. 6,560 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ఆలయ ఛైర్మన్ కర్రి వెంకటజగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఎంపిటిసి కుంచే బుచ్చిరాజు, అర్చకులు పెద్దింటి నారాయణచార్యులు, పురుషోత్తమాచార్యులు గ్రామస్తులు సేవలందించారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఈ నెల 22న జరగాల్సిన సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 24కి వాయిదా పడిందని మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం ఉన్న కారణంగా కొందరు వార్డ్ సభ్యులు సమావేశానికి హాజరు కాలేని పరిస్థితులున్నాయన్నారు. కావున ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

- అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి - యంత్రాంగం

గత 40 రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో జరిగింది. జిల్లా కేంద్రమైన కాకినాడతోపాటు, జిల్లాలోని మండల, డివిజన్ కేంద్రాల్లో కేంద్ర కార్మిక సంఘాలతోపాటు, ప్రజా సంఘాలు రాస్తారోకో నిర్వహించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశ, నిర్లక్ష వైఖరిని తప్పుపట్టాయి. **కాకినాడ** స్థానిక ఇంద్రపాలెం లాకుల వద్ద రాస్తారోకో నిర్వహించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యూటీని అమలు చేయాలని, ఇప్పటి వరకూ ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లకు జిఒలను విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి గొడుగు సత్యనారాయణ, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చెక్కా రమణి మాట్లాడుతూ లక్ష మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు తీరని అన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతిగా సేవలందించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత ఎక్కడదని ప్రశ్నించారు. ఒక్కరోజు భోగి మండపం నిర్మాణానికి రూ.2 కోట్ల ప్రజాధనాన్ని నీళ్ల ప్రాయంగా ఖర్చుచేసిన ముఖ్యమంత్రి అంగన్‌వాడీల వేతనాలు పెంచడానికి ప్రభుత్వం వద్ద నిధులు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 33 మంది సలహాదారులకు నెలకు రూ.3.50 లక్షలు చొప్పున వేతనాలు చెల్లించేందుకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. ఎంఎల్ఎ, ఎంపీల వేతనాలను రూ.50 వేల నుంచి రూ. 4 లక్షలకు పెంచుకుని, అట్టడుగున ప్రజలకు నేరుగా సేవ చేసే అంగన్ వాడీలకు వేతనాలు పెంచలేమని మంత్రులు చెప్పడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. ఐదేళ్ల కాలంలో విద్యుత్ ఛార్జీలు 14 సార్లు, పెట్రోలు డీజిల్ ధరలు 22 సార్లు పెంచిన ప్రభుత్వానికి చిరు ఉద్యోగుల వేతనాలను ఎందుకు పెంచరని ప్రజల ప్రశ్నలకు సమా ధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, రూరల్ నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, టి. రాజా, ఐద్వా నాయకురాలు భవాని, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు స్వామి, వెంకన్న, జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ్ కుమార్, మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణ, ఎఐసిసిటియు నాయకులు నరసరాజు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా అంగన్‌వాడీలు రాస్తా రోకో నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్క రించేంతవరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్య కమంలో యూనియన్ ఉపాధ్యక్షురాలు టి. నాగ సత్య, ప్రధాన కార్యదర్శి అల్లాడి లక్ష్మీ, కోశాధికారి కాసురి హేమ లత తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక ఆర్ అండ్ బి రోడ్డుపై అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ వైఖరిని నిరిసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. తక్షణమే తమ డిమాండ్లను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్య కర్తలు ఎన్.అమలావతి, సిహెచ్.వెంకటలక్ష్మి, జె.రాణి, పి.నూక రత్నం, ఆర్.రత్నకుమారి, పి.దుర్గాసూర్యకుమారి, కె.రమ్య, పి.గంగా భవాని, కె.బంగారుపాప, బి.కృపావతి పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ విజయవాడలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు 4వ రోజుకు చేరుకున్నాయన్నారు. మహిళలు 40 రోజులుగా తమ సమస్యల పరిష్కారం చేయాలని రోడ్డు మీద ఉంటే ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గడిగట్ల సత్తిబాబు, మాగాపు నాగు, రేలంగి వెంకట రావు, పెంటయ్య, నీల పాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, ప్రజా నాట్యమండలి నాయకులు రొంగల వీర్రాజు, దారపు రెడ్డి సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అమలావతి, ఫాతిమా, స్నేహలత, మహాలక్ష్మి, మంగాలక్ష్మి, సూర్య కుమారి, తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మరోతి శివగణేష్ సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీల డిమాండ్లను పెట్టిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి, జగ్గంపేట మండలాలకు చెందిన యూనియన్ నాయకులు సుజాత, రాజేశ్వరి, గంగాభవాని, రామ్‌లీలా, తదితరులు నాయకత్వం వహించారు. **పిఠాపురం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష శిబిరాన్ని సిపిఎం, ఇతర ప్రజా సంఘాల నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చి సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అంగన్‌వాడీల సమ్మెలో సిపిఎం, ప్రజా సంఘాలు ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోనేటి రాజు, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కరణం విశ్వనాథం, కుంచె చిన్న, ప్రజా సంఘాల నాయకులు వీరబాబు మోహనాచార్యులు, సూర్యచక్రం, ఎ రాజు, యూనియన్ నాయకులు విజయశాంత, నళిని, వెంకటలక్ష్మి, సూర్యకాంతం, రాఘవ, నాగ గన్నిక, దుర్గ, భవాని తదితరులు పాల్గొన్నారు. **కిర్లంపూడి** స్థానికంగా జరుగుతున్న నిరసన శిబిరం సమీపంలో అంగన్‌వాడీలు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను నెరవేర్చాలని, ప్రభుత్వం చేసే బెదిరింపులకు లొంగేది లేదని అన్నారు. వేతనాలు పెంచేవరకూ తమ సమ్మెను విరమించేది లేదని తేల్చిచెప్పారు. **కరప** గత 40 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో వివిధ కారణాలతో మృతి చెందిన అంగన్‌వాడీలకు సంతాపంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ శిబిరాన్ని సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్, ఐద్వా నాయకురాలు సిహెచ్ రమణి సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, దైవకుమారి, అచ్చారత్నం, కల్పలత, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో రాస్తారోకో చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఏలేశ్వరంలో రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పెద్దాపురంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



'పర్వత'కే టిక్కెట్టు ఇవ్వాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

సిట్టింగ్ ఎంఎల్ఎ పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్‌కే ప్రత్తిపాడు నియోజక వర్గం టిక్కెట్టును కేటాయించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా మండల వైసిపి అధ్యక్షుడు జిగిరెడ్డి, శ్రీను, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రమణమ్మ, వైస్ ఎంపిపి తిరుమల రాయలు, పలు గ్రామాలకు చెందిన సర్పంచులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఎన్ని కల్లో వైసిపి గుర్తుపై ఎంఎల్ఎగా గెలిచిన వరుపుల సుబ్బారావు నాటి టిడిపిలో చేరి పార్టీ ఫిరాయింపునకు పాల్పడ్డారని, అటువంటి వ్యక్తికి రాబోయే ఎన్ని కల్లో వైసిపి అభ్యర్థిగా ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. 2016 నుంచి ప్రస్తుతం ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ వైసిపిని నియోజకవర్గంలో బలోపేతం చేశారని అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థి విషయంలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పునరాలోచన చేసి పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌కే సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీటు కేటాయించకపోతే భవిష్యత్తు కార్యాచరణపై తమ నాయకుడు తీసుకునే నిర్ణయానికి తమ కట్టుబడి ఉంటామని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి మండల అధ్యక్షుడు జిగిరెడ్డి శ్రీను

శివారు భూములకు సాగునీరు అందించాలి

ప్రజాశక్తి - కాజులూరు

కాలువ శివారు భూములకు సాగు నీరు అందే విధంగా తక్షణ చర్యలు అధికారులు చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఒంటి తాడి, కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, దుగ్గుదూరు గ్రామాల్లో ఆయన స్థానిక రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ కాజులూరు మండలంలో అన్ని గ్రామాల్లో సాగునీటి ఎద్దడి ఉందని, ప్రతి ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడులు పెట్టారని, మొలక దశలో ఉన్న పంటకు ఆరుతడి కోసం నీరు అందించాల్సివుందని, అయితే నేటికీ నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఎదురుచూపులు చూస్తున్నారని అన్నారు. అలాగే పంట కాలువల్లో పూడుకుపోయిన చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. పొలంలో జల్లిన ఎరువులు కూడా కరగడం లేదని, డీజిల్ ఇంజన్లతో నీరు తోడుకుంటున్నప్పటికీ నీరు సాలడం లేదన్నారు. ప్రభుత్వం, అధికారులు బాధ్యతగా వ్యవహరించి పంటలకు అవసరమైన సాగునీటిని విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులందరినీ రోడ్డుపై కూర్చోబెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

పంటపొలాలను పరిశీలిస్తున్న వల్లు రాజబాబు

22న చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

చిత్తడి నేల సంరక్షణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎపి నేషనల్ గ్రీన్ కోర్, పాఠశాల విద్యాశాఖ, అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరుగుతుందని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యా శాఖాధికారిణి జి.నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శనివారం జిల్లా క్రీడా ప్రాధి కార సంస్థ ఆవరణలో గోడ పత్రికను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ చిత్తడి నేలపై అవగాహన కల్పించడానికి విద్యార్థులకు చేత లేఖన పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అన్ని యాజమన్య పాఠశాలలలో చదువుతున్న 6 నుంచి 10వ తరగతి చదువుచున్న విద్యార్థులు పాల్గొనవచ్చున్నారు. నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త కెవికె.మహేశ్వరరావు మాట్లాడుతూ గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో (వివేకానంద పార్కు) సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఉప విద్యాశాఖాధికారి జె.డేనియల్ రాజు, పిఠాపురం ఉప విద్యాశాఖాధికారిణి దాట్ల సుభద్ర, మండల విద్యాశాఖాధికారులు సిహెచ్.రవి, పి.పుల్లయ్య, నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు

గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగాలి

ప్రజాశక్తి - కాకినాడ

సమాజం గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా లాన్ టెన్నిస్ క్రీడాకారులు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా క్రీడా సాధికార సంస్థ మైదానంలో 67వ జాతీయ స్థాయి బాలుర లాన్ టెన్నిస్ పోటీలను శనివారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు క్రీడాకారుల మానసిక, శారీరక ఉల్లాసానికి, ఉత్సాహానికి, ఆరోగ్యానికి ముఖ్య కారణం అని తెలిపారు. జాతీయ స్థాయిలో పాల్గొంటున్న ప్రతి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ మనిషిలో స్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని క్రీడలు నింపుతాయన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఆత్మ స్థైర్యంతో ఎదుర్కోవడానికి క్రీడలు సహకరిస్తాయని తెలిపారు. కుడా ఛైర్మన్ రాగిరెడ్డి చంద్ర కళా దీప్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. అడిషనల్ ఎస్‌పి బి.సత్యనారాయణ మాట్లా డుతూ క్రీడా స్ఫూర్తిని పాటించాలన్నారు. పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ జి.భాను మూర్తి రాజు మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు క్రీడలు సహకరిస్తాయని అన్నారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి మాట్లాడుతూ 24 రాష్ట్రాల నుంచి 109 మంది క్రీడాకారులు, 46 మంది కోచ్‌లు, మేనేజర్‌లు పాల్గొన్నారని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను అతిథులు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్, జడ్‌పి పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కర్రి భామారెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బివివిఎస్‌వి.ప్రసాద్, విద్యాశాఖకు చెందిన అధికారులు ఆర్‌జె.డేనియల్ రాజు, డి.సుభద్ర, అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్ క్రీడల ప్రారంభ సూచికగా బుడగలను ఎగురవేస్తున్న కలెక్టర్

తగలబడ్డ డంపింగ్ యార్డ్ -పొగతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు

డంపింగ్ యార్డులో చెలరేగుతున్న మంటలు, పొగ

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

ఉప్పాడ దుర్గమ్మ ఆలయ సమీపంలో డంపింగ్ యార్డ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తగల బెట్టడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటలకుతోడు పొగ గ్రామం అంతా వ్యాపించడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఒక్కసారిగా పొగ వ్యాపించడంతో ఎక్కడ ఏమి జరిగిందో అర్థం కాక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. డంపింగ్ యార్డ్ తగులబడటంతో దుర్వాసనతో కూడిన పొగ వ్యాపించడంతో దుకాణాలను బంద్ చేశారు. డంపింగ్ యార్డ్‌కు సమీపాన ఉన్న శెట్టి బలిజి పేట వాసులు పొగతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. డంపింగ్ యార్డులో మంటలు, పొగ వ్యాపించినా అధికారులో ఎటువంటి చలనం లేకుండా పోయిందని ప్రజలు వాపోయారు. రాత్రి 9 గంటల దాటినా అగ్నిమాపక, రెవెన్యూ అధికారులెవ్వరూ స్పందించకపోవడాన్ని గ్రామస్తులు తప్పుపట్టారు.

కెవిపిఎస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజా సంఘాల భవనం వద్ద కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) 2024 క్యాలెండర్, డైరీలను కెవిపిఎస్ మండల అధ్యక్షుడు విప్పర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షులు, కెవిపిఎస్ గౌరవ అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు, రెడ్డి రెడ్డి బాబు, ఎండియుడబ్ల్యుఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతులు సంఘం జిల్లా నాయకులు వళ్ళు రాజబాబు, కాశీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాటల రచయిత భారవికి వేటూరి పురస్కారం

ప్రజాశక్తి - కోటనందూరు

వేటూరి సాహితీ పీఠం, శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వేటూరి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 29న ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు, పాటల రచయిత జెకె.భారవికి వేటూరి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగ రామజోగేశ్వర శర్మ తెలిపారు. ఇప్పటి వరకూ 12 మంది సినీ, సాహితీ రంగ ప్రముఖులకు వేటూరి పురస్కారాలను గత పన్నెండు సంవత్సరాలుగా ప్రదానం చేశారు. ఈ ఏడాది జెకె.భారవికి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ వేటూరి సాహితీ పీఠానికి శాశ్వత గౌరవ అధ్యక్షులుగా తనికెళ్ల భరణి, వ్యవస్థాపక అధ్యక్షులుగా చక్కా సూర్యనారాయణ, అధ్యక్షులుగా సిహెచ్. వికె నరసింహారావు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ నెల 29న తుని పట్టణంలో గల చిట్టూరి మెట్రోలో ఈ పురస్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు.

ఫోటో రైట్ అప్: సన్మాన గ్రహీత జె కె భారవి

ముగిసిన నవోదయ పరీక్షలు

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక జడ్‌పిఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ఎంట్రన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఇఒ కెహెచ్.నాయక్ తెలిపారు. నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలకు మండలం నంఉచి సుమారు 181 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 133 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షలకు సూపరింటెండెంట్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వెంకటేశ్వరరావు వ్యవహరించారని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లరేవు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన తెచ్చుకోవాలని వికసిత్ భారత్ ప్రభారి అధికారి ఉమా నందూరి అన్నారు. స్థానిక సూర్య భాస్కర కళ్యాణ మండపంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభ గ్రామ సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసిని దేవి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ విభాగాల స్టాల్స్‌ను ఢిల్లీ నుంచి వచ్చిన వికసిత్ భారత్ ప్రభారి అధికారి ఉమా నందూరి ఎంపిపి రాయుడు సునీతతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని వీడియో ప్రజెంటేషన్ ద్వారా సభికులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, వికసిత్ భారత్ సంకల్పయాత్ర భారత్ స్టేట్ కోఆర్డినేటర్ వేటుకూరి సూర్యనారాయణ రాజు, జిల్లా కోఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద గాంధీ, మండల బిజెపి అధ్యక్షులు దత్తాత్రేయ వర్మ, సిఇఒ ఎ.రమణారెడ్డి, డిపిఒ సౌజన్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

ప్రజాశక్తి - కాకినాడ

రాబోయే కాలంలో ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో శనివారం ఆడుదాం ఆంధ్ర పోటీల్లో మండల స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను తొలుత సచివాలయ పరిధిలో నిర్వహించి అక్కడ ప్రతిభ చూపిన వారిని నాలుగు మండలాలుగా విభజించి తుది పోటీలకు ఎంపిక చేశామన్నారు. నాలుగు మండలాల నుంచి 40 టీంలను ఎంపిక చేసి నియోజకవర్గస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - గండేపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ జ్యోతుల

బలహీనవర్గాల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని పరిణయ ఫంక్షన్ హాల్లో శనివారం జగ్గంపేట నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు శిలామంతుల వీరబాబు అధ్యక్షతన జయహో బిసి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిలకు టిడిపి పుట్టి నిల్లు వంటిదని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాకే బిసిలకు గుర్తింపు వచ్చిందన్నారు. టిడిపి అంటే బిసిలు, బిసిలు అంటే టిడిపి అన్నా గుర్తింపు వచ్చిందని తెలిపారు. అందుకే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాయ బిసిలను అణిచివేస్తూ, కక్షసాధింపులకు పాల్పడుతుందని విమర్శంచారు. ఆఖరికి బిసి విద్యార్థులు చదువుకునే వసతి గృహాల్లో సైతం వసతులు లేకుండా చేస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో బిసిలకు ఇచ్చే రుణాలను కూడా పూర్తిగా ఎత్తివేసిందని విమర్శంచారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన అనేక పథకాలను రద్దు చేసి బిసిలపై తన కక్షను తీర్చుకుంటుందని అన్నారు. 34 శాతం రిజర్వేషన్‌ను 24 శాతానికి తగ్గించి బిసిలకు రాజకీయ భవిష్యత్‌పై దెబ్బకొట్టారని అన్నారు. టిడిపి అధికారంలోకి రావడం ద్వారానే బిసిలకు తిరిగి రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించడం జరుగుతుందని, రాబోయే ఎన్నికల్లో బిసిలంతా టిడిపి, జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్‌విఎస్ .అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, రాష్ట్ర పెరిక సాధికారక సమితి కన్వీనర్ వనపర్తి బద్రి, తుమ్మల రమేష్, ఓమ్మి బాలాజీ మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, మండల బిసి సెల్ అధ్యక్షులు తంగెళ్ల అప్పారావు పాల్గొన్నారు.

క్రికెట్‌లో పనసపాడు జట్టు విజయం

ట్రోఫీని అందిస్తున్న ఎంపిపి సత్తిబాబు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

'ఆడుదాం ఆంధ్ర' క్రీడల్లో భాగంగా మండల స్థాయిలో క్రికెట్ పోటీల్లో విజేతగా పనసపాడు టీం విజయం సాధించింది. ఈ మేరకు విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమం శనివారం సాయంత్రం ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు చేతుల మీదుగా చేపట్టారు. సామర్లకోట మండలం గోంచాల - అచ్చంపేట గ్రామాల మధ్య గల గ్రౌండ్స్‌లో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పనసపాడు సచివాలయం 1 టీమ్ మాధవపట్నం టీం పై విజయం సాధించింది. ఈ సందర్భంగా ఎంపిపి సత్తిబాబు మాట్లాడుతూ జిల్లాస్థాయిలోనూ సామర్లకోట మండల టీము అత్యంత ప్రతిభను కనబరిచి మండలానికి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.శ్రీ లలిత, ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు విద్యార్థునుల ఎంపిక

ప్రజాశక్తి - కాజులూరు

తమ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని స్థానిక జడ్‌పి పాఠశాల హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన గుండ్రాజు శివ జాహ్నవి, గీసాల తేజశ్రీ రమ్య, మోకన ప్రవల్లిక జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని, వీరికి నాలుగు సంవత్సరాల పాటు రూ.12 వేలు చొప్పున నగదు ప్రోత్సాహం ఉంటుందన్నారు. విద్యార్థునులకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు చింతా నారాయణమూర్తి, బుజ్జిబాబు, నరిగిరి సుబ్రహ్మణ్యం, దుర్గావజ్జుల శివప్రసాద్, షేక్ వల్లీ బాషా, గుత్తుల విజయలక్ష్మి, యర్రంశెట్టి సుజాత, సుధారసం రాజేశ్వరి, సంగాని తులసిలను. విద్యార్థునులను జడ్‌పిటిసి వనుం సుబ్బారావు, ఎంపిపి మాతా భారతీ మురళి, ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు, పాఠశాల తల్లితండ్రుల కమిటీ ఛైర్మన్ కోన రాధాకృష్ణ, ఎంఇఒలు వివేకానంద, జాన్, తదితరులు అభినందించారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి విజేతలకు బహుమతులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ళ క్రాంతిసుధాకర్, ఎంపిడిఒ ఎంవిఆర్. కుమార్‌బాబు, జడ్‌పిటిసి బెహరా రాజరాజేశ్వరి, ఎంఇఒ రాజబాబు పాల్గొని మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచే విద్యతోపాటు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని, నైపుణ్యం పెరుగుతుందని అన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కాశీ విశ్వనాథం, వైసిపి నాయకులు బెహరా దొరబాబు, ఎంపిటిసి సభ్యులు పినిశెట్టి శేఖర్, భాస్కరరావు పలువురు సర్పంచులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన కూటమిదే విజయం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్, గండేపల్లి

రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీ కూటమిదే విజయమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం గుర్రప్పాలెం గ్రామానికి చెందిన పలువురు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వారికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సమక్షంలో పడాల విష్ణుతోపాటు, పలువురికి ఆయన టిడిపి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీలో చేరుతున్న వారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నేను కావాలో, పదవి ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్ళేవారు కావాలో తేల్చుకోవాలన్నారు. తన 42 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో జగ్గంపేట నియోజకవర్గం తప్ప పక్క నియోజకవర్గానికి వెళ్లలేదని ఇప్పుడు ఓట్లు కోసం వచ్చే తోట నరసింహం ఎక్కడ పని వస్తుందంటే అక్కడికి వెళ్లి వచ్చిన నాయకులని గుర్తుంచుకోవాలన్నారు.గండేపల్లి మండలం లోని నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన వైసిపికి చెందిన నాయకులు, కార్యకర్తలు శనివారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన 30 కుటుంబాలకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ టిడిపి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనపై ప్రజలు విసిగిపోయారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోర్పు లచ్చయ్యదొర, ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, శిలామంతుల వీరబాబు, కురుకూరి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లిలో టిడిపిలో చేరిన వారికి పార్టీ కండువాలను కప్పిన జ్యోతుల నెహ్రూ

డెర్మా షైన్‌లో లేజర్ చికిత్స

ప్రజాశక్తి - కాకినాడ

తమ డెర్మా షైన్ స్కిన్ ఎయిర్ అండ్ లేజర్ సెంటర్‌లో అత్యాధునిక లేజర్ చికిత్సను అందుబాటులో ఉన్నట్లు సెంటర్ నిర్వాహకులు డాక్టర్ ఎన్.స్పందనా రెడ్డి తెలిపారు. 'ప్రజాశక్తి'తో శనివారం డాక్టర్ స్పందనారెడ్డి మాట్లాడుతూ నగరంలోని మమత స్కాన్ సెంటర్ ఎదురుగా పేర్రాజు పేటలో డెర్మా షైన్ స్కిన్ ఎయిర్ అండ్ లేజర్ సెంటర్‌లో అన్ని రకాల చర్మవ్యాధులు, హెయిర్ సమస్యలకు తగిన రీతిలో వైద్యం చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే మెటిమలు, తామర, నల్ల మచ్చలు, మంగ, అణిలు, పులిపిరులు, సూరీడుకాయలు, సోరియాసిస్, గజ్జి, బుల్లి సెగ్గడ్డలు బ్యాక్టీరియల్, వైరల్ అండ్ ఫంగల్ వంటి చర్మ వ్యాధులకు చికిత్స చేయడం జరుగుతుందని తెలి పారు. జుట్టు/హెయిర్‌కు సంబంధించి చుండ్రు, జుట్టు రాలుట వంటి చికిత్సలు చేస్తామన్నారు. ఆరోగ్యకరమైన చర్మం, అంద మైన ముఖం కొరకు ప్రత్యేక చికిత్సను అందిస్తా మని చెప్పారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని స్పందనారెడ్డి తెలిపారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్ర పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు శనివారంతో ముగిసాయి. క్రికెట్ పోటీలు ఆర్‌బి కొత్తూరులోని డిసిఎల్ గ్రౌండ్లో, కబడ్డీ పోటీలు తిరుపతి గ్రామంలో, వాలీబాల్, కోకో, షటిల్ బ్యాడ్మెంటన్ పోటీలు రాయ భూపాలపట్నం జడ్‌పి హైస్కూల్లో నిర్వహించారు. క్రికెట్ పోటీలో కొండపల్లి, కబడ్డీలో తిరుపతి, వాలీబాల్‌లో తాటిపర్తి, మహిళలు, పురుషుల కోకో పోటీల్లో దివిలి, మహిళల షటిల్ బ్యాడ్మెంటన్‌లో కట్టమూరు-1, పురుషుల పోటీల్లో మరలావ జట్లు విజయం సాధించాయి. శనివారం సాయంత్రం రాయ భూపాలపట్నంలో ఎంపిడిఒ బి.అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిర్యాల రాజా పాల్గొని విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ నల్లల నాగేంద్రబాబు, ఎంపిటిసి సభ్యులు భద్రరావు, గోపు మురళి, పరిమి శ్రీను, గోలి రామారావు, నరాలశెట్టి త్రినాథ్, పెంటా విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సిఐ ఆర్థిక సాయం

గ్యాస్ స్టౌవ్‌లను పంపిణీ చేస్తున్న సిఐ లక్ష్మణరావు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రంగవల్లి నగర్ కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు జగ్గంపేట సిఐ వి.లక్ష్మణరావు ఆర్థిక సాయం అందించారు. శనివారం సిఐ రంగవల్లి నగర్ కాలనీ లో అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాలను పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు గ్యాస్ కనెక్షన్లు అందించి మాట్లాడారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత ఏడు కుటుంబాలను ఆదుకునేందుకు పోలీస్ తరపున సహకారం అందించినట్లు తెలిపారు. సమాజంలో పోలీసులకు ప్రజలకు సత్సంబంధాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. న ష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని సిఐ అన్నారు.

జయహో బిసి సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పిఠాపురం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

ఈ నెల 25, 26, 27 తేదీల్లో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించబోయే జయహో బిసి సమావేశాలను జయప్రదం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం నియోజకవర్గ బిసి సెల్ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ 25న పిఠాపురం మండలం, 26న కొత్తపల్లి, 27 గొల్లప్రోలు మండలంలో ఈ జయహో బిసి సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో బిసిలు ఏఏ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారో తెలుసుకుని, ఆ సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చేందుకు పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కేవలం చంద్రబాబుతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికలలో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి చిన్న, శీరం మాణిక్యం, మాజీ జడ్‌పిటిసి బర్ల అప్పారావు, శ్రీనివాస్, శ్రీరాములు, బంగారుబాబు, శ్రీను, సన్నిబాబు, మేరుగు సూరిబాబు, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు రెడ్డం భాస్కరరావు, సకుమళ్ళ గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ అశోక్

రీజెన్సీ కంపెనీలో మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

మిషన్ గ్రీన్ పుదుచ్చేరి కార్యక్రమంలో భాగంగా స్థానిక రీజెన్సీ సిరామిక్స్ కంపెనీలో మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.సత్యేంద్రప్రసాద్ అధ్యక్షతన శనివారం మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రీజెన్సీ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని మాట్లాడారు. 12 సంవత్సరాలుగా మూతపడి ఉన్న రీజెన్సీ సిరామిక్స్ కంపెనీ మళ్ళీ పున్హ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రస్తుత వాతావరణంలో మార్పులు, కాలుష్య నివారణలో భాగంగా కంపెనీ పన్ఱ ప్రారంభం నేపథ్యంలో ముందుగా మొక్కలు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. పంపిణీ చేసిన మొక్కలను తమ ఇంటి ప్రాంగణంలో నాటాలని మహిళలకు సూచించారు. ఎండి సత్యేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మిషన్ గ్రీన్ పుదుచ్చేరి గూర్చి ప్రజలకు వివరించారు. అనంతరం ఎంఎల్ఎ అశోక్ చేతుల మీదుగా మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, కంపెనీ సిఓఓ కె.మోహన్ రావు, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ ఆదేశాల మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా యానాం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అరుల్ ప్రగాశంను సస్పెండ్ చేస్తూ పుదుచ్చేరి కలెక్టర్ వల్లవన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే విధుల నుంచి తొలగించడంతోపాటు అనుమతులు లేకుండా యానాం వదిలి వెళ్ళరాదంటూ ఉత్తర్వులో ఆదేశించారు. యానాంలో నడుస్తున్న పేకాట క్లబ్బులకు సంబంధించి నిబంధనలు విరుద్ధంగా విక్టరీ, గుడ్ లక్ క్లబ్ లకు సరైన పత్రాలు లేకుండా లైసెన్సులను రెన్యువల్ చేశారంటూ వచ్చిన ఫిర్యాదులపై సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

పలువురికి ఎంఎల్ఎ అశోక్ పరామర్శ

ప్రజాశక్తి - యానాం

ఇటీవల కాలంలో దరియాలతిప్ప, అయ్యన్న నగర్, గణపతి నగర్ గ్రామాల్లో అకాల మరణం చెందిన వారి కుటుంబాలను, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం పరామర్శించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక నాయకులు పండు సిద్ధార్థ కుమార్, నక్కల సుబ్బన్న, కొల్లు నూకాంరం, సబ్బతి లోకేశ్వరరావు, సబ్బతి శ్రీనివాసరావు, అలెక్స్, రాజు బాబు తదితరులు ఉన్నారు.

శ్రీనుకు సంఘీభావంగా ధర్నా

అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న వినోద్ మిశ్రా పార్టీ కార్యకర్తలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గత ఐదేళ్లుగా చేయని నేరానికి జైల్లో మగ్గిపోతున్న దళిత యువకుడు జనుపల్లి శ్రీనివాసరావుకు సంఘీభావంగా వినోద్ మిశ్రా పార్టీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు గుమ్మడి పాదాలమ్మ, గూనాపు వరాహలమ్మ మాట్లాడుతూ శ్రీను తన బెయిల్ కోసం జైల్లో దీక్ష నిర్వహిస్తుండగా కుటుంబ సభ్యులు జైలు బైట దీక్ష చేపట్టారన్నారు. వారి దీక్షను భగ్నం చేయడానికి జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులప సుందరి, కందుల వరలక్ష్మి, లోపింటి జయమ్మ, కాకర నాగమణి, కందుల సునీత ఉన్నారు

జాతీయ రహదారి దిగ్బంధం


కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలం కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద జయహో రథసారధి లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు జాతీయ రహదారిని దిగ్బంధించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. దాదాపు 40 నిమిషాల పాటు జాతీయ రహదారిని ముట్టడించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధిక సంఖ్యలో ఆందోళనకారులు టోల్ ప్లాజా వద్దకు చేరుకోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

వైఎస్‌ఆర్ బీమా సాయం అందజేత

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలేకుర్రు గ్రామపంచాయతీ సుంకటరేవులో ప్రాంతానికి చెందిన వడ్లమూరి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల కాలంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలోనే సర్పంచ్ వెంటపల్లి నూకరాజు ఆధ్వర్యంలో పలువురు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. వైఎస్‌ఆర్ బీమా ద్వారా తక్షణ సహాయంగా రూ.10వేలను మృతుని కుటుంబ సభ్యులు సాయిలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి సుధ, స్థానిక వార్డు సభ్యులు పలివెల శ్రీనివాసరావు, పలివెల నాగేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు బల్ల సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.